నేడు జేఎన్‌టీయూలో బోనాలు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ క్యాంపస్ రేణుకా ఎల్లమ్మ బోనాలను ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఉద్యోగులు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి క్యాంపస్ రెసిడెంట్ క్వార్టర్స్ నుంచి ఉద్యోగులు అమ్మవారికి బోనాలు సమర్పిస్తారని వారు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : తలసాని


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని, కార్పొరేటర్ మహేశ్వరి

బేగంపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం బేగంపేట డివిజన్‌లోని ఎయిర్‌లైన్స్‌కాలనీలో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ టి.మహేశ్వరితో కలిసి ఆయన ప్రారంభించారు. ఎయిర్‌లైన్స్ కాలనీలో కూడా రోడ్లు, పార్కులు, సివరేజీ లైన్లు తదితర అభివృద్ధి పనులను చేపట్టినట్లు తలసాని తెలిపారు. కాలనీలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు గిరిధర్‌గోపాల్, బీఆర్‌ఎస్ నాయకులు టి.శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్, తాళ్ల రాజయ్య, బంతి నర్సింహ, శేఖర్ ముదిరాజ్, శ్యామ్‌సుందర్, మోయిన్, ఆరీఫ్, రాజేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


విజయారెడ్డిని కలిసిన యాదవ సంఘం ప్రతినిధులు

యాదవ సంఘానికి పూర్తి సహకారం

● కార్పొరేటర్ విజయారెడ్డి

ఖైరతాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ యాదవ సంఘం కార్యాలయంతో పాటు పురాతన ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందని కార్పొరేటర్ విజయారెడ్డి తెలిపారు. యాదవ సంఘం అధ్యక్షుడు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు శనివారం ఆమెను ఖైరతాబాద్‌లో కలిశారు. నూతన కార్యవర్గాన్ని ఆమె సత్కరించారు. యాదవుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని విజయారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు పాండు యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌యాదవ్, కోశాధికారి మహేష్‌యాదవ్, కుల పెద్దలు గంగనబోయిన కృష్ణయాదవ్, మారయ్య యాదవ్, ఓదుల్ యాదవ్, భవానీకృష్ణయాదవ్, ఆంజనేయులు యాదవ్, మల్లేష్ యాదవ్, శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సనత్‌నగర్ ఇన్‌చార్జి నియామకం

బేగంపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ సనత్‌నగర్ ఇన్‌చార్జిగా పాటిగడ్డకు చెందిన తలారి సత్యనారాయణ నియమితులయ్యారు. తెలంగాణ ఉద్యమ నేత తాళ్ల రాజయ్య ఆధ్వర్యంలో శనివారం బేగంపేటలో జరిగిన సత్యనారాయణ సన్మాన కార్యక్రమానికి కార్పొరేటర్ టి. మహేశ్వరి హాజరయ్యారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు టి.శ్రీహరి, బంతి తదితరులు పాల్గొన్నారు.

నాలాల్లో పూడికతీత పనులు

హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నాలాల్లో చెత్తతో పాటు ఆక్రమణలను హైడ్రా తొలగిస్తోంది. హైడ్రా మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లు, డీఆర్‌ఎఫ్ బృందాలు సంయుక్త ఆధ్వర్యంలో కల్వర్టులు క్లియర్ చేస్తున్నారు. నాలాల్లో తొలగించిన చెత్తను వెంటనే ఆ పరిసరాల నుంచి లారీల్లో తరలిస్తున్నారు. ఖైరతాబాద్ శ్రీధర్ ఫంక్షన్‌హాల్ వద్ద బుల్కాపూర్ నాలా ఆక్రమణలను తొలగించింది. కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు నాలా ఆక్రమణలను తొలగించింది. ఖైరతాబాద్ చౌరస్తా వద్ద నాలా కల్వర్టులో పెద్దఎత్తున పేరుకుపోయిన వ్యర్థాలను హైడ్రా యుద్ధప్రాతిపదికన తొలగించింది. లాంగ్ ఆర్మ్ జేసీబీతో చెత్తతో పాటు థర్మోకోల్, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించడంతో వరద సాఫీగా ముందుకు పోతుందని స్థానికులు చెబుతున్నారు.

బోనాలకు ఏర్పాట్లు చేయాలని వినతి

ఖైరతాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బోనాలతో వచ్చే మహిళలకు ఆలయాల వద్ద ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, మహిళా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరుతూ మైత్రీ సంఘాల ప్రతినిధులు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఖైరతాబాద్, సైఫాబాద్ ఇన్‌స్పెక్టర్లకు శనివారం వినతిపత్రాలు అందజేశారు. ఏడుగుళ్ల ఆలయం, మహాకాళి, చింతలబస్తీ ఏడుగుళ్ల ఆలయం, జీహెచ్‌ఎంసీ కార్యాలయం ముందున్న భూలక్ష్మమ్మ, నల్లపోచమ్మ ఆలయాల వద్ద అవసరం మేరకు బారికేడ్లు ఏర్పాట్లు చేయాలని కోరారు. ఉత్సవాలు శాంతియుతంగా జరిగేలా మైత్రీ, శాంతి కమిటీల సభ్యులు సహకరించాలని ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, సైఫాబాద్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి కోరారు.

చోరీకి గురైన 67 సెల్‌ఫోన్‌లు రికవరీ

బంజారాహిల్స్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): చోరీకి గురైన 67 సెల్‌ఫోన్‌లను పోలీసులు రికవరీ చేశారు. వాటిని బాధితులకు అప్పగించారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మాసబ్‌ట్యాంక్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో సెల్‌ఫోన్ చోరీలపై ఫిర్యాదులు పెరగడంతో పోలీసులు వాటి రికవరీపైన దృష్టి సారించారు. ఐఎంఈఐ నెంబర్ ఆదారంగా సెల్‌ఫోన్‌లు ఉన్న ప్రాంతాలను గుర్తించి రికవరీ చేశారు. బంజారాహిల్స్ పరిధిలో 19, మాసబ్‌ట్యాంక్ 17, జూబ్లీహిల్స్ 22, ఫిలింనగర్ పరిధిలో 9 సెల్‌ఫోన్‌లను రికవరీ చేసినట్టు ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి తెలిపారు.

ఐఈఐ తెలంగాణ చాప్టర్ చైర్మన్ ఎన్నిక


డాక్టర్ రమణనాయక్, రమేష్‌ను అభినందిస్తున్న ఐఈఐ సభ్యులు

పంజాగుట్ట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్(ఐఈఐ) ఇండియా తెలంగాణ చాప్టర్ చైర్మన్‌గా ఆచార్య డాక్టర్ రమణ నాయక్, కార్యదర్శిగా మర్రి రమేష్ ఎన్నికయ్యారు. శనివారం ఖైరతాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండేళ్లపాటు వీరు ఈ పదవిలో కొనసాగుతారు. దేశవ్యాప్తంగా విస్తరించిన ఈ సంస్థకు తెలంగాణలో హైదరాబాద్‌తో పాటు వరంగల్, కొత్తగూడెం, రామగుండంలో కేంద్రాలు ఉన్నాయి. సివిల్, మైనింగ్ ఇంజనీర్లకు నిపుణుల సలహాలు, వర్క్‌షాపులు నిర్వహిస్తూ అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్న సంస్థకు 105 ఏళ్ల ఘన చరిత్ర ఉంది. తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత సంస్థ చేపట్టిన అనేక కార్యక్రమాలతో పలుసార్లు దేశంలోనే ప్రముఖ కేంద్రంగా తెలంగాణ కేంద్రానికి పురస్కారాలు లభించాయి. చిత్తశుద్ధితో మంచి కార్యక్రమాలు నిర్వహించి సంస్థకు మరింత ఉన్నత గౌరవం కల్పించే దిశగా కృషి చేస్తామని ఆచార్య రమణనాయక్, మర్రి రమేష్ తెలిపారు. ఇంజనీర్లకు వృత్తిపర నైపుణ్యం పెంపొందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. తమపై నమ్మకం ఉంచి ఎన్నుకున్నందుకు సభ్యులకు, పూర్వ చైర్మన్లకు కృతజ్ఞతలు తెలిపారు.


మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానిస్తున్న జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు కాటూరి రమేష్, మచ్చ లక్ష్మణ్ తదితరులు
● బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి

'డిగ్రీ గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలి'

పంజాగుట్ట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలని డిగ్రీ గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొర్ర ఈశ్వర్‌లాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అసోసియేషన్ సమన్వయకర్త డాక్టర్ పి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు అశోక్, శివుడు, టి.గోపాల్, ఎస్.రాజు, జనార్దన్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ఎనిమిది విశ్వవిద్యాలయాల పరిధిలోని 149 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 1,940 మంది అతిథి అధ్యాపకులు పనిచేస్తున్నారని తెలిపారు. తమ రెన్యూవల్‌పై ప్రభుత్వం ఇప్పటి వరకు ఫైనాన్స్ అప్రూవల్ జీవో ఇవ్వకపోవడంతో గెస్ట్ లెక్చరర్ల నియామక ప్రక్రియ ఆలస్యం అవుతోందని, ఇది విద్యార్థుల పాలిట శాపంగా మారి విద్యా ప్రమాణాలను దెబ్బతీస్తోందని అన్నారు. త్రిసభ్య కమిటీతో డెమో తీసుకునే విధానాన్ని రద్దు చేసి, గత సంవత్సరం పనిచేసిన ప్రతీ అతిథి అధ్యాపకుడిని రెన్యువల్ చేయాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

'ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి'

పంజాగుట్ట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి అతి తక్కువ ఆర్థిక భారం పడే ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్(ఎస్టీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం పీడకలగా మిగిల్చిన 317 జీవో బాధితులను స్థానిక జిల్లాలకు బదిలీ చేయాలని ఆయన కోరారు. ఖైరతాబాద్‌లోని ఎస్టీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 700 ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, దానికంటే ముందుగా బదిలీలు చేపట్టి పదోన్నతులు ఇవ్వాలని అన్నారు. రాష్ట్రంలో 24 జిల్లా విద్యాశాఖ అధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఒకేషనల్ అధ్యాపకులకు క్వాలిఫికేషన్ నిర్ధారణ చేసి, ఆ పోస్టులను కూడా మంజూరు చేస్తూ టైం స్కేల్ ఇవ్వాలని అన్నారు. కేజీబీవీలలో పని చేస్తున్న మహిళా ఉపాధ్యాయులకు సెలవులను 27 వరకు పెంచాలని ఉద్యోగ నియామకాలలో వారికి వెయిటేజ్ కల్పించాలని కోరారు. సమావేశంలో ఎస్టీఎఫ్ రాష్ట్ర నాయకులు పరశురామ్, నరసింహరాజు, మనోహర్, రవిశంకర్ పాల్గొన్నారు.

ఎంహెచ్‌ఎం కోర్సు ప్రవేశ గడువు పొడగింపు

నిమ్స్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నిమ్స్‌లో మాస్టర్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్(ఎంహెచ్‌ఎం) కోర్సులో చేరేందుకు గడువును జూలై 21 వరకు పొడిగిస్తున్నట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాల కోసం 040-2348 9189లో సంప్రదించాలని ఆయన సూచించారు.

గంజాయి తాగుతున్న యువకులు అరెస్టు

యూసుఫ్‌గూడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గంజాయి తాగుతున్న నలుగురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్ గూడ కృష్ణానగర్ లేబర్ అడ్డా వద్ద ఎం.భరత్ తేజ, ఎం.గణేష్‌గుణశేఖర్, షేక్ సైఫుల్లా, షేక్ జిలానీ పెట్రోలింగ్ పోలీసులకు శనివారం అనుమానాస్పదంగా కనిపించారు. అదుపులోకి తీసుకొని విచారిస్తుండగా గంజాయి తాగుతూ పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. 80 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి


మహాధర్నాలో అభివాదం చేస్తున్న ఎంపీలు ఆర్.కృష్ణయ్య, ఈటల

కవాడిగూడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి.. దాని స్థానంలో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని పలువురు రాజకీయ పార్టీ నేతలు, వివిధ సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద చేపట్టిన మహాధర్నాకు ఎంపీలు ఆర్.కృష్ణయ్య, ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, పైడి రాకేష్‌రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు తదితరులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై పార్లమెంట్ వేదికగా తన గొంతు వినిపిస్తానన్నారు. ఈటల మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేయకపోతే ప్రభుత్వాలు స్తంభించిపోయే పరిస్థితులు ఉన్నాయని హెచ్చరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉపసంఘం వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల్లో మార్పు రావాలన్నారు. రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ స్థానికసంస్థల ఎన్నికల లోపే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని చెప్పారు.



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం సభ్యులు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం సికింద్రాబాద్ రీజియన్ గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన సాదం బాల్‌రాజ్, రాణీగంజ్ డిపో గౌరవ అధ్యక్షుడు కోటేశ్వర్ గౌడ్‌లు శనివారం వెస్ట్ మారేడుపల్లిలోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగులకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జోన్ గౌరవ అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నిరంజన్, మహేష్, సంపత్ తదితరులు ఉన్నారు.

నర్సింగ్ హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలి



వేంనరేందర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించిన ప్రభుత్వ నర్సింగ్ విద్యార్థినులు

బౌద్ధనగర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): న్యూబోయిగూడ ప్రభుత్వ నర్సింగ్ హాస్టల్‌లో సమస్యలను పరిష్కారించాలని నర్సింగ్ విద్యార్థినులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కోరారు. శనివారం సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలులో సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థినులు వేం నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. 2022 నుంచి హాస్టల్‌లో డ్రైనేజీ, తాగునీటి సమస్య ఉందని, పరిష్కారించాలని అప్పటి ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేదని పేర్కొన్నారు. సుమారు 209 మంది విద్యార్థినులు న్యూబోయిగూడ నర్సింగ్ హాస్టల్‌లో ఉంటున్నామని డ్రైనేజీ సమస్య వల్ల 2024 లో హాస్టల్‌ను ఖాళీ చేసి ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్నామని దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని సూచించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కల్పించుకుని సమస్యలను పరిష్కారించాలని విజ్ఞప్తి చేశారు.

పీడిత వర్గాల విముక్తికి ఉద్యమాలు చేపడదాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తదితరులు

బౌద్ధనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పీడిత వర్గాల విముక్తి కోసం దేశ వ్యాప్త ఉద్యమాలు చేపడదామని, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. శనివారం సాయంత్రం మధురానగర్‌కాలనీ జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాలులో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నం గి నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల జిల్లా ఇన్‌చార్జిలు, కో-ఇన్‌చార్జిల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నో ఒడిదుడకులు, కష్టాలు, నష్టాలు ఎదుర్కొని అనేక అడ్డంకులు అధిగమించి అంతిమంగా ఎస్సీ వర్గీకరణ విజయాన్ని సాధించామన్నారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ, ఎంఎస్‌పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఇంజం వెంకటస్వామి, ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ ఏపీ అధ్యక్షుడు సురేష్‌మాదిగ, నరేంద్రబాబు, హైదరాబాద్ ఇంచార్జి డప్పు మల్లికార్జున్ మాదిగ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి : మైనంపల్లి

బోయినపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. బోయినపల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో కంటోన్మెంట్ ఒకటో వార్డు పరిధిలోని బోయినపపల్లిలో గల రాముగౌడ్ నివాసంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల అల్పాహార విందు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజ్‌గిరి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే పాల్గొని కార్యకర్తలకు, యువతకు పలు సూచనలు చేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం



మధు కిషోర్(ఫైల్)

బౌద్ధనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో నష్టం రావడం, ఆర్థిక ఇబ్బందులతో ఓ కూరగాయల వ్యాపారి అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై జ్ఞానేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం మెట్టుగూడ ఆలుగడ్డబావికి చెందిన డి.మధుకిషోర్(48) కూరగాయలు వ్యాపారం చేస్తుంటాడు. వ్యాపారంలో నష్టం రావటంతో మనస్థాపానికి గురై 5వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి కోసం పలుచోట్ల గాలించిన ఫలితం లేదు. దీంతో తన భర్త కనిపించటం లేదని భార్య బాలమణి శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాలేజీకి వెళ్లిన విద్యార్థిని..



మధు కిషోర్(ఫైల్)

అడ్డగుట్ట, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : కుమార్తెను కాలేజీలో దింపి వెళ్లిన కొద్దిసేపటికే ఆమె అదృశ్యమైన ఘటన గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం లాలాగూడ శాంతినగర్‌కు చెందిన షేక్ ఖాజా భాషా కుమార్తె శశిస్థాబేగం సికింద్రాబాద్‌లోని వెస్లీ మహిళా డిగ్రీ కాలేజీలో బీకాం రెండో సంవత్సరం చదువుతుంది. 8వ తేదీన కుమార్తెను కాలేజీలో దింపిన వెళ్లిన కొద్దిసేపటికే కాలేజీ నుంచి తండ్రికి ఫోన్‌లో తమ కుమార్తె కాలేజీకి రాలేదని సమాచారం రావడంతో తండ్రి కాలేజీ వద్ద గాలించినా ఫలితం లేకపోయింది. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేయగా ఫలితం లేదు. తండ్రి గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో తాత్కాలికంగా కూతురు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు సీసీ ఫుటేజీల పరిశీలించినా ఫలితం లేకపోయింది. పోలీసులు 11న విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కింద కేసు నమోదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రైలుకింద పడి ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన లాలాగూడ ప్రాంతంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం లాలాగూడ రైల్వేస్టేషన్ సమీపంలోని న్యూబ్రిడ్జి వద్ద గుర్తుతెలియని 35 ఏళ్ల వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుని ఆచూకీ తెలిస్తే సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.



శ్రీదేవి పోచమ్మ అమ్మవారు



ఉజ్జయినీ మహాకాళి ఆలయం



మహాకాళి ఆలయం వద్ద భద్రత ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఉత్తర మండల డీసీపీ రశ్మీ పెరుమాళ్



సుభాష్ రోడ్డులో క్యూ లైన్లు

జాతరకు సిద్ధమైన లష్కర్



ముత్యాలమ్మ ఆలయం కళాసిగూడ



మహాకాళి ఆలయం వద్ద భక్తులకు స్వాగతం పలుకుతూ పూలతో రూపొందించిన క్యూ



సోమసుందరంవీధిలోని శ్రీదేవి పోచమ్మ దేవాలయం

ఏర్పాట్లు పూర్తి

సికింద్రాబాద్, రాంగోపాల్‌పేట్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే లష్కర్ బోనాల జాతరకు సర్వం సిద్ధమైంది. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి ఆలయంతోపాటు సికింద్రాబాద్ సోమసుందరం వీధిలోని శ్రీదేవి పోచమ్మ దేవాలయం, కళాసీగూడలోని ముత్యాలమ్మ దేవాలయం, ఆర్పీ రోడ్డులోని పెద్దమ్మ దేవాలయం తదితర దేవాలయాలు రంగు రంగుల పుష్పాలతో, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయాల పరిసరాలలో సిరీస్ లైట్లు ఏర్పాటు చేయడంతో శనివారం రాత్రి నుంచే అన్ని దేవాలయాల పరిసరాలు విద్యుత్ కాంతులతో జిగేలుంటున్నాయి. ఆషాఢ బోనాల పండుగను కనుల పండువగా నిర్వహించడానికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. రెండురోజుల పాటు బోనాల జాతరలో భాగంగా ఆదివారం అమ్మవారికి బోనాల సమర్పణ, సోమవారం భవిష్యవాణి వినిపించే రంగం కార్యక్రమాలు ఘనంగా జరగనున్నాయి. నేడే లష్కర్ బోనాల పండుగ. తెలంగాణ రాష్ట్ర పండుగ అయిన బోనాల పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఆలయ చరిత్ర

1813వ సంవత్సరంలో మిలిటరీలో పని చేసే సికింద్రాబాద్ వాస్తవ్యులు సురిటి అప్పయ్య మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినీ టవర్‌కు బదిలీ అయిన కొద్ది రోజులకే ఉజ్జయినీలో కలరా వ్యాధి ప్రబలి వేలాదిమంది మృత్యువాత పడ్డారు. ఆ సమయంలో సురిటి అప్పయ్య, ఆయన అనుచరులు ఉజ్జయినీలో మహాకాళి దేవిని దర్శించుకుని, కలరా వ్యాధి నుంచి ప్రజలను కాపాడాలని, పరిస్థితులు అనుకూలించిన తర్వాత సికింద్రాబాద్‌లో శ్రీ మహాకాళి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ఆలయాన్ని నిర్మిస్తామని మొక్కుకున్నారు. వెంటనే కలరా వ్యాధి మాయమైంది. అనంతరం వారు సికింద్రాబాద్‌కు తిరిగి వచ్చి 1815వ సంవత్సరంలో(ఇప్పుడు అమ్మవారు ఉన్న ప్రదేశం) కట్టెతో అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించి, నిత్యపూజలు ప్రారంభించారు. శ్రీ అమ్మవారికి శ్రీ ఉజ్జయినీ మహాకాళి అని నామకరణం చేశారు.

పూర్వం ఈ ప్రాంతం చెట్లు, చేమలతో నిండిపోయి ఉండేది, ఆలయం పక్కన ఒక పెద్ద బావికి మరమ్మతులు చేసే సమయంలో తవ్వకాల్లో శ్రీమాణిక్యాలదేవి విగ్రహం లభించింది. అమ్మవారు ఎనిమిది సంవత్సరాల బాలిక కలలో వచ్చి తన అక్క అనగా మహాకాళి అమ్మవారి పక్కన ప్రతిష్ఠాపన చేయాలని కోరగా, ఆ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కాగా సురిటి అప్పయ్య కట్టె విగ్రహం స్థానంలో ఇప్పుడున్న మహాకాళి, మాణిక్యాలమ్మ విగ్రహాలను ప్రతిష్ఠ చేసి ఆలయ నిర్మాణం చేశారు. నాటి నుంచి వైదిక ఆగమ శాస్త్రానుసారంగా నిత్య పూజలు జరుగుతున్నాయి. 1953లో ఆలయాన్ని దేవాదాయశాఖ ఆధీనంలోకి తీసుకుని, భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి చేస్తూ, సేవలు అందిస్తోంది.

నేడు, రేపు మద్యం దుకాణాల బంద్

● ఎక్సైజ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జగన్ మోహన్‌రెడ్డి

తిరుమలగిరి జూలై 12 (ఆంధ్రజ్యోతి): మహాకాళి బోనాల జాతరను పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో మద్యం దుకాణాలను ఆది, సోమవారం బంద్ చేయిస్తున్నామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జగన్‌మోహన్ రెడ్డి శనివారం తెలిపారు. ఆరోజుల్లో అక్రమంగా విక్రయిస్తే కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. రెండు రోజుల పాటు మద్యం దుకాణాలతో పాటు కల్లు కాంపౌండ్‌లు కూడా మూసి ఉంటాయని తెలిపారు.

మహాకాళి బోనాల జాతర..
ట్రాఫిక్ ఆంక్షలు

హరిహరకళాభవన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఉజ్జయినీ మహాకాళి బోనాలను పురస్కరించుకుని హరిహరకళాభవన్‌లో శనివారం నార్త్‌జోన్ సిబ్బందితో పాటు ఇతర బలగాలు హజరయ్యారు. ఐపీఎస్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సుంకరి శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్‌ఆఫ్ పోలీస్, ట్రాఫిక్ సి.వేణుగోపాలరెడ్డి, ఏసీపీ ట్రాఫిక్-1 నార్త్ జోన్ శంకర రాజా, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ట్రాఫిక్, మహంకాళి పోలీస్‌స్టేషన్, ఆర్.రఘునాథ్ పాల్గొన్న ఈ సమావేశంలో బోనాల సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్ ఏర్పాట్లు, భక్తుల జనసందోహ నిర్వహణ రోడ్ల మూసివేతపై మార్గనిర్దేశం చేశారు. ఆదివారం ఉదయం 12 నుంచి జాతర ముగిసే వరకు, 15 ఉదయం మూడు గంటల వరకు కొనసాగుతాయని సూచించారు. ఆలయం చుట్టూ రెండు కిలోమీటర్ల వరకు వాహనాల రాకపోకలపై నిషేదం ఉంటుందని తెలిపారు. కింద పేర్కొన్న బడిన రహదారులు మూసి ఉంటాయి.

● టొబాకో బజార్, హిల్ స్ట్రీట్ నుంచి మహాకాళి ఆలయానికి వెళ్లే మార్గం ● టాటాఎక్స్ రోడ్స్ నుంచి రోచా బజార్ వరకు సుబాష్‌రోడ్
● ఆదయ్య ఎక్స్ రోడ్ నుంచి మహాకాళి ఆలయం వెళ్లే వరకు
● జనరల్ బజార్ నుంచి మహాకాళి ఆలయానికి వెళ్లే మార్గం

రైలు ప్రయాణీకులకు సూచనలు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రయాణీకులు చిలకలగూడ వైపు నుంచి ప్లాట్‌ఫాం 10 ప్రవేశ ద్వారం ఉపయోగించాలి. ప్లాట్‌ఫాం- 1 రద్దీగా ఉండే అవకాశం వుంది.

ట్రాఫిక్ మళ్లింపులు

రాణీగంజ్ ఎక్స్‌రోడ్, గ్యాస్‌మండి ఎక్స్‌రోడ్, పట్టణి ఎక్స్‌రోడ్, ప్యారడైజ్ ఎక్స్‌రోడ్. ప్రజలు ఆర్టీసి బస్సులకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేశామని, డైవర్షన్ మ్యాప్‌లు చూడాలని సూచించారు.

పార్కింగ్ ఏర్పాట్లు

తూర్పు దక్షిణం వైపు నుంచి వచ్చేవారికి: హరిహరకళాభవన్, మహబూబ్ కాలేజీ, ఓల్డ్ జైల్‌ఖానా, ఇస్లామియా స్కూల్(గ్యాస్ మండి), ఆదయ్య మెమోరియల్ స్కూల్, మహాత్మాగాంధీ విగ్రహం(వీఐపీ), తాజ్ ట్రిస్టార్ లైన్, బెల్సన్ తాజ్‌హోటల్, సీఎంఆర్ షాపింగ్ మాల్, స్వప్న లోక్ కాంప్లెక్స్.

పడమటి వైపు నుండి వచ్చే వారికి: వెస్లీ కాలేజీ(జీహెచ్‌ఎంసీ గ్రౌండ్), నల్లగుట్ట(జీహెచ్‌ఎంసీ గ్రౌండ్), చుట్టల బస్తీ

సూచనలు: బోనాల సందర్భంగా గుంపులు అధికంగా వుండే అవకాశమున్నందున ప్రజలు ముందుగానే ప్రయాణించాలని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులతో సహకరించాలని సూచించారు.



ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మహాధర్నాలో అభివాదం చేస్తున్న ఎంపీలు ఆర్ కృష్ణయ్య, ఈటల రాజేందర్ తదితరులు

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలి

● ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలి

● ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహాధర్నాలో ఎంపీలు కృష్ణయ్య, ఈటల

కవాడిగూడ, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి.. దాని స్థానంలో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని పలువురు రాజకీయ పార్టీ నేతలు, వివిధ సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద చేపట్టిన మహాధర్నాకు ఎంపీలు ఆర్.కృష్ణయ్య, ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, పైడి రాకేష్‌రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు తదితరులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై పార్లమెంట్ వేదికగా తన గొంతు వినిపిస్తానన్నారు. ఈటల మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేయకపోతే ప్రభుత్వాలు స్తంభించిపోయే పరిస్థితులు ఉన్నాయని హెచ్చరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉపసంఘం వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల్లో మార్పు రావాలన్నారు. రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ స్థానికసంస్థల ఎన్నికలలోపే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని చెప్పారు.

చదువుకోమని మందలించినందుకు యువకుడి ఆత్మహత్య

రాజేంద్రనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): చదువుకోమని తల్లి మందలించినందుకు మనస్తాపం చెందిన బాలుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హైదర్‌గూడకు చెందిన సునీల్(19) పదో తరగతి పరీక్షలు తప్పి ఇంటి వద్దే ఉంటున్నాడు. మంచిగా చదివి పదో తరగతి పూర్తి చేయాలని తల్లి తరచూ చెప్పేంది. ఇదే విషయమై శనివారం ఉదయం కుమారుడిని చదువుకోమని మందలించింది. దాంతో మనస్తాపం చెందిన సునీల్ ఇంట్లోకి వెళ్లి ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధృవీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మార్పీఎస్ సనత్‌నగర్ ఇన్‌చార్జి నియామకం

బేగంపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ సనత్‌నగర్ ఇన్‌చార్జిగా పాటిగడ్డకు చెందిన తలారి సత్యనారాయణ నియమితులయ్యారు. తెలంగాణ ఉద్యమ నేత తాళ్ల రాజయ్య ఆధ్వర్యంలో శనివారం బేగంపేటలో జరిగిన సత్యనారాయణ సన్మాన కార్యక్రమానికి కార్పొరేటర్ టి. మహేశ్వరి హాజరయ్యారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన

బౌద్ధనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ డివిజన్ ఎన్‌బీటీనగర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జెండా దిమ్మెను దగ్గరుండి కూల్చివేసిన నగర మేయర్ గద్వాల విజయలక్ష్మీని బర్తరఫ్ చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సీతాఫల్‌మండి చౌరస్తాలో సికింద్రాబాద్ కో-కన్వీనర్ నందారం సీతారాం మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని ఏర్పాటుచేసిన జెండా గద్దెను మేయర్ కూల్చి వేయించటం సిగ్గుచేటని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి డప్పు మల్లికార్జున్ మాదిగ, నాయకులు వేణుగోపాల్, భూపతి సుజాత మాదిగ, సురారం సుజాత, విజయ, రుద్ర, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



కంటి అద్దాలను అందజేస్తున్న ఎస్‌జీఎఫ్ నిర్వహకుడు ముకుల్, జంపన ప్రతాప్

నిరుపేదల సంక్షేమానికి అండ

బోయినపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ప్రాంత నిరుపేదల సంక్షేమానికి ఎళ్లవేళలా అందుబాటులో ఉంటూ కంటికి రెప్పలా కాపాడుతుందని ఎస్‌జిఎఫ్(శ్రీగణేష్ ఫౌండేషన్) నిర్వాహకుడు ముకుల్ అన్నారు. శ్రీగణేష్ ఫౌండేషన్ క్లబ్ సౌజన్యంతో బోయినపల్లి పెన్షన్ లైన్‌లో ఇటీవల ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్యుల సూచన మేరకు 153 మందికి శనివారం ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని శ్రీగణేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్‌జిఎఫ్ నిర్వాహకుడు ముకుల్ ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, కాంగ్రెస్ నాయకుడు ముప్పిడి మధుకర్‌లతో కలిసి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మారుతి గౌడ్, బల్వంత్ రెడ్డి, బంగారు సదానంద్, గుడ్డు తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు నిరసన వ్యక్తం చేసేందుకు యత్నం

● రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ అసోసియేషన్ చైర్మన్ సతీష్ కుమార్ గుప్తా అరెస్ట్ ● సొంత పూచీకత్తుపై విడుదల

మారేడుపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సీఎం కాన్వాయ్‌కు నిరసన వ్యక్తం చేయాలని యత్నించిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ అసోసియేషన్ జేఏసీ చైర్మన్ తేలుకుంట సతీష్ గుప్తాను శనివారం కార్ఖానా పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం కార్ఖానా ఓల్డ్ వాసవి నగర్‌కు చెందిన తేలుకుంట సతీష్ గుప్తా కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈయన రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ అసోసియేషన్ జేఏసీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. శనివారం సీఎం కార్ఖానా రహదారిలో నల్సార్ యూనివర్సిటీ వెళ్లున్నట్టు తెలుసుకున్నారు. ఈ విషయాన్ని అసోసియేషన్ గ్రూపులో తెలుపుతూ సభ్యులందరూ ప్లకార్డులతో కాన్వాయ్ వచ్చే సమయంలో నిరసన వ్యక్తం చేయాలని సందేశం పంపించారు. విషయం తెలుసుకున్న కార్ఖానా పోలీసులు సతీష్‌గుప్తాను ముందస్తుగా అరెస్ట్ చేసి అనంతరం సొంత పూచికత్తుపై విడిచిపెట్టారు. కార్ఖానా మార్గంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఎలివేటెడ్ కారిడర్ విస్తరణాన్ని 200 అడుగులకు కాకుండా 100 అడుగులకు కుదించాలని డిమాండ్ తాము అనేక రోజులుగా చేస్తున్నామన్నారు. విషయాన్ని సీఎం దృష్టికి తీసుకు వెళ్లేందుకు నిరసన చేపట్టాలని అనుకున్నామని ఆయన తెలిపారు.

పార్కు చేసిన బైకుల చోరీ.. మహారాష్ట్రలో విక్రయాలు

● దొంగను పట్టించిన సీసీ కెమెరా

అడ్డగుట్ట, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పార్కు చేసి ఉన్న బైకుల చోరీలకు పాల్పడుతున్న దొంగను గోపాలపురం పోలీసులు అరెస్టు చేయగా మరో దొంగ పరారీలో ఉన్నాడు. నిందితుడి నుంచి 13 బైకులను స్వాధీనం చేసుకున్నారు. గోపాలపురం పోలీస్‌స్టేషన్ సీఐ మధుకుమార్, క్రైమ్ సీఐ అభిషేక్‌లు మీడియాతో మాట్లాడుతూ సికింద్రాబాద్‌లోని గోపాలపురం పోలీస్‌స్టేషన్‌లో ఇమ్రాన్ అనే వ్యక్తి తన బైక్‌ను ఇంటి ముందు పార్కు చేసి కొద్దిసేపటి తర్వాత బయటికి రాగా బైకు కనిపించకపోవడంతో బాధితుడు 10వ తేదీన గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసును చాలెంజ్‌గా తీసుకున్న క్రైమ్ సీఐ అభిషేక్‌తో పాటు క్రైమ్ కానిస్టేబుళ్ల నేరం జరిగిన ప్రదేశంలో సీసీ కెమెరాలను పరిశీలించగా మహరాష్ట్ర బిలోలి ఖడ్గం గ్రామానికి చెందిన బలిరాం హన్మంత్(21)తో పాటు అజయ్ అనే వ్యక్తి బైకు చోరీ చేసినట్లు కనిపించడంతో వెంటనే బలిరాం హన్మంత్ కదలికలపై నిఘా పెట్టారు. నిందితుడు బలిరాం హన్మంత్ తన ఊరిలో ఉన్నట్లు తెలుసుకున్న క్రైమ్ కానిస్టేబుళ్ల చాకచక్యంగా నిందితుడిని పట్టుకొని హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 1, మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో 3, కూకట్‌పల్లిలో 3, గాంధీనగర్ 1, చర్లపల్లి 1, అల్లాపూర్ 1 నగరంలోని పలు పోలీస్ స్టేషన్ పరిధిలో పార్కు చేసి ఉన్న బైకులను మారు తాళలతో తీసి చోరీ చేసినట్లు విచారణలో నేరం ఒప్పుకున్నాడు. ఈ బైకులను తక్కువ ధరకు మహారాష్ట్ర తన సొంత ఊర్లో విక్రయిస్తున్నట్లు తెలిపాడు. ఇతనికి సహకరించిన అజయ్ అనే నిందితుడు పరారీలో ఉన్నాడని డీఐ తెలిపారు. నిందితుడి నుంచి 13 బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న అజయ్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బైకులు